సాక్షి సంగారెడ్డి
శనివారం, 4, మార్చి, 2023



ఫైర్ సేఫ్టీపై పట్టింపేది? 8లో
వేసవిలో పరిశ్రమల్లో అగ్ని ప్రమాదాల నివారణకు ముందస్తు చర్యలు తీసుకోవడంలో అధికారులు విఫలమవుతున్నారు.



తల్లి కొడుతోందని..
మతిస్థిమితం లేని తల్లి తరచూ కొడుతుండటంతో భరించలేని ఇద్దరు బాలికలు ఇంటి నుంచి వెళ్తుండగా.. ఉపాధి హామీ కూలీలు గమనించి చేరదీశారు. 8లో



సిలిండర్ ధర తగ్గించాలి 9లో
పెంచిన వంట గ్యాస్ సిలిండర్ ధరలను తగ్గించాలని బీఆర్ఎస్ నాయకులు డిమాండ్ చేశారు. సిలిండర్లతో రోడ్లపైకి వచ్చి నిరసన తెలిపారు.

న్యూస్‌రీల్

మంత్రి పర్యటనకు పకడ్బందీ ఏర్పాట్లు

కలెక్టర్ డాక్టర్ శరత్



మాట్లాడుతున్న కలెక్టర్ శరత్

సంగారెడ్డి టౌన్: మంత్రి హరీశ్‌రావు ఈనెల 6న జిల్లాలో పర్యటించనున్న నేపథ్యంలో పకడ్బందీ ఏర్పాట్లు చేస్తున్నామని కలెక్టర్ డాక్టర్ శరత్ అన్నారు. శుక్రవారం కలెక్టరేట్‌లో సంబంధిత శాఖల అధికారులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మంత్రి హరీశ్‌రావు సంగారెడ్డి జిల్లా కేంద్రంతో పాటు పటాన్‌చెరు, జహీరాబాద్, కోహీర్ మండలాల్లో చేపట్టనున్న పలు అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొంటారని తెలిపారు. ఆయా శాఖల అధికారులు ఏర్పాట్లు చేయాలని సూచించారు. ఎలాంటి పొరపాట్లకు తావివ్వకుండా సమన్వయంతో పని చేయాలన్నారు. ఈ సమావేశంలో డీఎఫ్ఓ, డీపీఓ, మెడికల్ కళాశాల, తార డిగ్రీ కళాశాల, నర్సింగ్ కళాశాల ప్రిన్సిపాళ్లు, ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి సూపరింటెండెంట్, ఆస్పత్రుల సమన్వయ కర్త, మహిళా శిశు సంక్షేమ శాఖ, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

రూ.35.25 కోట్ల బడ్జెట్‌కు ఆమోదం

జోగిపేట మున్సిపల్ చైర్మన్ గూడెపు మల్లయ్య



జోగిపేట మున్సిపల్ సమావేశం దృశ్యం

జోగిపేట(అందోల్): జోగిపేట మున్సిపాలిటీలో 2023 – 24 సంవత్సరానికి సంబంధించి రూ.35.25 కోట్ల బడ్జెట్‌కు ఏకగ్రీవంగా ఆమోదం లభించిందని మున్సిపల్ చైర్మన్ జి.మల్లయ్య, కమిషనర్ కె.రవిబాబు తెలిపారు. శుక్రవారం మున్సిపల్ సమావేశంలో తీసుకున్న నిర్ణయాలను చైర్మన్ వెల్లడించారు. మున్సిపాలిటీకి రూ.4.63 కోట్లు రాబడి ఉండగా, రూ.4.62 కోట్ల ఖర్చు ఉన్నట్లు తెలిపారు. అదనంగా మున్సిపాలిటీకి ఎస్‌డీఎఫ్, 15వ ఫైనాన్స్ నిధుల కింద రూ.35.21 కోట్లు రాగా వివిధ అభివృద్ధి పనులు చేపట్టేందుకు తీర్మానం లభించినట్లు తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ ప్రవీణ్‌కుమార్, కౌన్సిలర్లు, సురేందర్‌గౌడ్, చిట్టిబాబు, హరికృష్ణాగౌడ్, రేఖా ప్రవీణ్, దాకూరి శంకర్, లక్ష్మీబాయి. ధనలక్ష్మి, కోఆప్షన్ సభ్యులు అల్లె శ్రీకాంత్, ఎండీ ఫైజల్, రమీజాబేగం, తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్ పరీక్షలకు 52 కేంద్రాలు

అదనపు కలెక్టర్ వీరారెడ్డి



సంగారెడ్డి టౌన్: జిల్లాలో ఈనెల 15 నుంచి ప్రారంభమయ్యే ఇంటర్మీడియట్ వార్షిక పరీక్షలకు పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలని అదనపు కలెక్టర్ వీరారెడ్డి ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లో ఇంటర్ పరీక్షల నిర్వహణపై సంబంధిత శాఖల అధికారులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మార్చి 15వ తేదీ నుంచి ఏప్రిల్ 4వ తేదీ వరకు ఉదయం 9.00 గంటల నుంచి మధ్యాహ్నం 12.00 గంటల వరకు నిర్వహించే ఇంటర్ పరీక్షలకు ఆయా శాఖల అధికారులు సమన్వయంతో ఏర్పాట్లు చేయాలన్నారు. జిల్లాలో 52 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలులో ఉంటుందన్నారు. కేంద్రాలకు దగ్గర్లోని జిరాక్స్ సెంటర్లు మూసివేసేలా చర్యలు తీసుకోవాలని పోలీస్ అధికారులకు సూచించారు. విద్యార్థులు గంట ముందు పరీక్షా కేంద్రాలకు చేరుకోవాలని సూచించారు. ఆర్టీసీ, వైద్య, విద్యుత్ అధికారులు విద్యార్థులకు ఇబ్బందులు కలగకుండా తగిన ఏర్పాట్లు చేయాలన్నారు. పరీక్షా కేంద్రాల్లో తాగునీరు, ఫ్యాన్స్, మరుగుదొడ్లు ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సమావేశంలో జిల్లా ఇంటర్మీడియట్ అధికారి గోవింద్‌రామ్, పోలీస్, పోస్టల్, ఆర్టీసీ శాఖల అధికారులు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు. అంతకుముందు జిల్లాలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలల ప్రిన్సిపాళ్లు, సబ్జెక్ట్ టీచర్లతో సమావేశమై పలు సూచనలు చేశారు.

సంగారెడ్డి జైలు.. ఖైదీలతో ఫుల్

మందుబాబులు, సైబర్ నేరగాళ్ల తాకిడీ

- సామర్థ్యానికి మించి అండర్ ట్రయల్ ఖైదీల తరలింపు
- సైబరాబాద్ ఏరియా వాళ్లూ ఇక్కడికే..



సంగారెడ్డిలోని సెంట్రల్ జైలు

సాక్షిప్రతినిధి, సంగారెడ్డి: సంగారెడ్డి జైలుకు ఖైదీల తాకిడీ పెరిగిపోతోంది. సామర్థ్యానికి మించి ఖైదీలను ఈ జైలులో ఉంచాల్సి వస్తోంది. ఒక్కోసారి జైలు సామర్థ్యంలో రెంటింపు సంఖ్యలో ఖైదీలు ఇందులో సర్దుబాటు చేయాల్సి వస్తోందని జైళ్ల శాఖ వర్గాలు పేర్కొంటున్నాయి. సంగారెడ్డి జిల్లా జైలులో మొత్తం 387 మందిని మాత్రమే ఉంచేందుకు వీలుంటుంది. ఇందులో 40 మంది మహిళల కోసం ప్రత్యేక విభాగం ఉండగా, మిగిలిన దాంట్లో పురుషులను ఉంచుతారు. ఒక్కోసారి సుమారు 700 వందలకు పైగా ఖైదీలను ఈ జైలులో ఉంచాల్సి వస్తోందని జైల్ అధికారులు చెబుతున్నాయి.

- సంగారెడ్డి జైలులో అండర్ ట్రయల్, శిక్ష పడిన ఖైదీలతో కలిపి 533 మంది ఉన్నారు. ఇందులో 30 మంది మహిళా ఖైదీలున్నారు. మొత్తం 533 మందిలో శిక్ష పడిన ఖైదీలు 63 మంది ఉండగా, మిగిలిన వారంతా అండర్‌ట్రయల్ ఖైదీలు. ఈ జిల్లా జైలును రెండు నెలల క్రితమే సెంట్రల్ జైలుగా అప్‌గ్రేడ్ చేశారు. ఈ మేరకు 2022 డిసెంబర్ 29న ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.

డ్రంకెన్ డ్రైవ్‌లో పట్టుబడిన వారు ఇక్కడే..

హైదరాబాద్ నగరంలో పోలీసులు తరచూ డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు నిర్వహిస్తున్నారు. ఈ తనిఖీల్లో పట్టుబడిన మందుబాబులందరికి ఒక రోజు నుంచి రెండు వారాల వరకు శిక్ష పడుతోంది. ఇలా శిక్ష పడిన మందుబాబులను పదుల సంఖ్యలో ఈ జైలుకు తరలిస్తున్నారు. ప్రతిరోజూ 20 మంది వరకు శిక్ష పడిన మందుబాబులను పోలీసులు ఈ జైలుకు తరలిస్తున్నారు. వీరితో జైలు అధికారులు గార్డెనింగ్, నర్సరీ, కూరగాయల పెంపకం, క్లీనింగ్ వంటి పనులు చేయిస్తున్నారు.

- మరోవైపు హైదరాబాద్ పోలీసులు అరెస్ట్ చేసిన సైబర్ నేరాలకు పాల్పడుతున్న అండర్‌ట్రయల్ ఖైదీలను కూడా ఈ జైలుకే తరలిస్తున్నారు. సుమారు 90 మంది ఖైదీలు సైబర్ నేరగాళ్లు ఈ జైలులో అండర్ ట్రయల్ ఖైదీలుగా ఉన్నట్లు అధికారులు చెబుతున్నారు. వీరంతా హైదరాబాద్ పోలీసులు అరెస్టు చేసిన వారే కావడం గమనార్హం. జార్ఖండ్, రాజస్థాన్, ఒడిశా, ఉత్తరప్రదేశ్, ఢిల్లీ ఇలా ఉత్తరాది రాష్ట్రాలకు చెందిన సైబర్ నేరగాళ్లతో ఈ జైలు కిటకిటలాడుతోంది.

హైదరాబాద్‌కు సమీపంలో ఉండటంతోనే..!

రాష్ట్రంలో అతిపెద్ద సెంట్రల్ జైళ్లలో ఒకటైన వరంగల్‌లోని సెంట్రల్ జైలును ప్రభుత్వం కూల్చి వేయడంతో, ఆ జైలులో ఉన్న శిక్ష పడిన ఖైదీలను హైదరాబాద్‌లోని చర్లపల్లి, చంచల్‌గూడ జైళ్లకు సర్దుబాటు చేశారు. దీంతో ఆ రెండు జైళ్లు నిండిపోవడంతో, హైదరాబాద్‌కు సమీపంలో ఉన్న సంగారెడ్డి సెంట్రల్ జైలుకు అండర్ ట్రయల్ ఖైదీలను తరలిస్తున్నారు.



కలెక్టరేట్ ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న అంగన్‌వాడీ ఉద్యోగులు, సీఐటీయూ నాయకులు

జీతాలు పెంచే వరకు పోరాడుతాం

- సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మల్లికార్జున్
- కదం తొక్కిన అంగన్‌వాడీలు

కొండాపూర్(సంగారెడ్డి): పెండింగ్ సమస్యలను పరిష్కరించాలని అంగన్‌వాడీ ఉద్యోగులు కదం తొక్కారు. కలెక్టరేట్ ఎదుట చేపట్టిన మహా ధర్నా రెండో రోజు శుక్రవారం ప్రశాంతంగా కొనసాగుతున్న సమయంలో పోలీసులు అంగన్‌వాడీ ఉద్యోగులను అరెస్ట్ చేసి బలవంతంగా పోలీస్ స్టేషన్‌కు తరలించారు. హక్కుల్ని సాధించుకునే వరకు పోరాటాన్ని ఆపమంటూ వేలాదిమంది అంగన్‌వాడీ ఉద్యోగులు పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. ఈ కార్యక్రమానికి హాజరైన సీఐటీయూ రాష్ట ఉపాధ్యక్షుడు మల్లికార్జున్ మాట్లాడుతూ అంగన్‌వాడీలను పర్మినెంట్ చేయాలని, కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. గ్రాట్యుటీ ఈఎస్ఐ, పీఎఫ్, రిటైర్మెంట్ బెనిఫిట్స్, పెన్షన్ సదుపాయాలు కల్పించాలని డిమాండ్ చేశారు. అనంతరం సీఐటీయూ రాష్ట కార్యదర్శి మల్లేశం మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఐసీడీఎస్ వ్యవస్థను నిర్వీర్యం చేసేందుకు కుట్ర చేస్తున్నాయని ఆరోపించారు. సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి మంగ, సీటీయూ నాయకులు యాదగిరి, చిరంజీవి, విద్యాసాగర్, ప్రవీణ్, బాబురావు, శశికళ, ఏసుమని, సంగీత, శోభ, విజయలక్ష్మి, కల్పన, జమున, అరుణ, ఇందిర, షేకమ్మ, జయమ్మ, శివలక్ష్మి, నాగేశ్వరి, శాంతమ్మ, సుశీల, రజిత, విజయ, కవిత, పద్మ, పాల్గొన్నారు.

గ్రామాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి



స్వచ్ఛభారత్ ప్రతిజ్ఞ చేస్తున్న అధికారులు, ప్రజలు

కంది(రంగారెడ్డి): గ్రామాలను పరిశుభ్రంగా ఉంచేందుకు అధికారులు, ప్రజలు పాటుపడాలని స్వచ్ఛ భారత్ జిల్లా కోఆర్డినేటర్ స్వామి పిలుపునిచ్చారు. శుక్రవారం కంది మండల పరిధిలోని చిమ్నాపూర్‌లో స్వచ్ఛభారత్ మిషన్‌పై మండలంలోని అన్ని గ్రామాల పంచాయతీ కార్యదర్శులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాలుష్యకారకమైన సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌ను పూర్తిగా నిషేధించాలన్నారు. ఇంటింటికీ మరుగుదొడ్డితో పాటు ఇంకుడు గుంతలను నిర్మించాలని సూచించారు. దీంతో రోగాలు రాకుండా ఉంటాయని తెలిపారు. తడి, పొడిచెత్తను వేరుచేసి పంచాయతీ ట్రాక్టర్లలో వేయాలన్నారు. ఈవిషయమై పంచాయతీ కార్యదర్శులు, వీఓఏలు ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. అలాగే గ్రామాల్లో మురికి నీరు నిల్వ ఉండకుండా కాల్వలను శుభ్రం చేయించాలన్నారు. పరిసరాలు పరిశుభ్రంగా ఉన్నప్పుడే ప్రజలు ఆరోగ్యాంగా ఉంటారని తెలిపారు. అనంతరం స్వచ్ఛ భారత్ ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ విశ్వప్రసాద్, ఎంపీఓ మహేందర్ రెడ్డి, సర్పంచ్ ప్రమీలాప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

జాతీయస్థాయికి అందోల్ క్రీడాకారుడు

జోగిపేట(అందోల్): జైపూర్ అపెక్స్ యూనివర్సిటీలో ఈనెల 5వ నుంచి 10వ తేదీ వరకు జరిగే ఆల్ ఇండియా పోటీలకు అందోల్‌కు చెందిన ప్రవీణ్‌కుమార్ ఎంపికయ్యా డు. గత నెల 25, 26 తేదీల్లో హైదరాబాద్‌లోని కాచిగూడ జూనియర్ కళాశాల క్రీడ ప్రాంగణంలో జరిగిన అంతర్ కళాశాలల కార్ఫ్ బాల్ పోటీల విభాగంలో దోమలగూడ జీసీపీఈ కళాశాల తరపున ప్రవీణ్‌కుమార్ పాల్గొని ప్రతిభ కనబరిచి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యాడు. ప్రవీణ్‌కుమార్ ఎంపిక పట్ల అందోల్ పాఠశాల పీఈటీ వీబీ శ్రీనివాస్, అందోల్ స్పోర్ట్స్ డెవలప్‌మెంట్ కమిటీ సమన్వయ కర్త మధుసూదన్ రెడ్డి, సభ్యులు హర్షం వ్యక్తం చేశారు.

రేపు గురుకులాల సీఓఈ, యూజీ ప్రవేశ పరీక్ష

జోగిపేట(అందోల్): తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయ సంస్థ ఆధ్వర్యంలో ఇంటర్, డిగ్రీ కళాశాలల్లో 2023 – 24 విద్యా సంవత్సరానికి గాను ప్రవేశ పరీక్షలు ఈనెల 5న ఆదివారం నిర్వహిస్తున్నట్లు గురుకులాల రీజినల్ కోఆర్డినేటర్ భీమయ్య గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇంటర్ ప్రవేశ పరీక్ష సమయం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు, డిగ్రీ ప్రవేశ పరీక్ష మధ్యాహ్నం 2.30 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు జరుగుతాయన్నారు. పరీక్షా కేంద్రాలు సంగారెడ్డి జిల్లాలో సీఓఈ ఇంటర్‌కి గాను ఇస్నాపూర్, చిట్కుల్, హత్నూర, అందోల్, కొండాపూర్, బుదేరా, రంజోల్‌లో నిర్వహిస్తున్నామని, ఇందులో 4,325 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారని తెలిపారు. యూజీ సెట్ డిగ్రీ ప్రవేశానికి పరీక్ష కేంద్రాలు ఆర్‌సీఓ పరిధిలోని మెదక్, కొల్చారం, బుదేర, ఇస్నాపూర్, చిట్కుల్‌లలో నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఈ పరీక్షకు 1,738 మంది విద్యార్థులు హాజరవుతున్నారని తెలిపారు. విద్యార్థులు పరీక్షా కేంద్రాలకు ఒక గంట ముందే చేరుకోవాలని ప్రతి విద్యార్థి www.tgugcet.cgg.in లో హాల్‌టికెట్‌ను డౌన్‌లోడ్ చేసుకొని వెంట తీసుకురావాలని సూచించారు.

మళ్లీ కట్టెల పొయ్యిలే దిక్కా?

సిలిండర్ ధర పెంపుపై ఎమ్మెల్యే క్రాంతికిరణ్ ఆగ్రహం



జోగిపేటలో మహిళలతో కలిసి నిరసన తెలుపుతున్న ఎమ్మెల్యే క్రాంతికిరణ్

జోగిపేట(అందోల్): గ్యాస్ ధరలు పెంచడంతో మహిళలకు మళ్లీ కట్టెల పొయ్యిలే దిక్కవుతాయేమోనని అందోల్ ఎమ్మెల్యే చంటి క్రాంతికిరణ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. శుక్రవారం జోగిపేటలోని హనుమాన్ చౌరస్తా వద్ద గ్యాస్ ధర పెంపుదలను నిరసిస్తూ కేంద్ర ప్రభుత్వ వైఖరికి నిరసనగా ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మోదీ అధికారాన్ని చేపట్టినప్పటి నుంచి ఇప్పటివరకు 13 సార్లు గ్యాస్ ధరలు పెంచారన్నారు. క్రికెట్ స్కోర్ మాదిరిగా గ్యాస్ ధర పెరుగుతూ పోతుందని ఎద్దేవా చేశారు. బీజేపీ అధికారాన్ని చేపట్టకముందు రూ.450 ఉన్న గ్యాస్ సిలిండర్ నేడు రూ.1,200కు చేరిందన్నారు. రాష్ట్రంలో కేసీఆర్ ప్రభుత్వం ప్రజా సంక్షేమానికి అనేక కార్యక్రమాలు చేపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ జి.మల్లయ్య, మార్క్‌ఫెడ్ రాష్ట్ర డైరెక్టర్ ఎస్.జగన్మోహన్ రెడ్డి, మాజీ ఏఎంసీ చైర్మన్‌లు పి.నారాయణ, డీబీ నాగభూషణం, ఎం.మల్లికార్జున్, బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు సార శ్రీధర్, ఎంపీపీ అధ్యక్షుడు జి.బాలయ్య, ఆత్మకమిటీ చైర్మన్ యాదగిరి రెడ్డి, పుల్కల్ మండల అధ్యక్షుడు ముద్దాయిపేట విజయ్‌కుమార్, మాజీ అధ్యక్షుడు నర్సింహారెడ్డి, వనం అధ్యక్షుడు వీరారెడ్డి, మఠం భిక్షపతి, తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదమని తెలిసినా..

శిథిలాల తొలగింపు, మట్టి చదును చేయడం, చెత్తను తరలించే క్రమంలో జేసీబీని ఎక్కువగా వాడుతుంటారు. అయితే వాహనాల్లో తరలించాల్సిన సిమెంట్ బస్తాలను సంగారెడ్డి కొత్త బస్టాండ్ ఎదురుగా జేసీబీ ముందు భాగంలో నింపి పని ప్రదేశాలకు ఇలా ప్రమాదకరంగా తరలిస్తున్నారు. ఇలా వెళ్లే క్రమంలో అనుకోకుండా జేసీబీ హైడ్రాలిక్ పాడయ్యి రోడ్డుపై వెళ్లే వాహనదారులకు ఏదైనా ప్రమాదం జరిగితే ఎవరు బాధ్యత వహిస్తారని పట్టణ ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఒక్కోసారి ఇందులో కూలీలను కూర్చోబెట్టుకొని వెళ్తున్నారు.

– సాక్షి స్టాఫ్ ఫొటోగ్రాఫర్, సంగారెడ్డి



త్వరలోనే అన్నింటికీ పరిష్కారం

వీధి కుక్కల బెడద నుంచి ప్రజలకు రక్షణ కల్పిస్తాం

- దోమలు, పందుల నివారణకు చర్యలు చేపడుతున్నాం
- గ్రేడ్ వన్ మున్సిపాలిటీ కమిషనర్ చంద్రశేఖర్
- సాక్షి ఫోన్ ఇన్‌కు విశేష స్పందన



ప్రజల సమస్యలు తెలుసుకుంటున్న కమిషనర్ చంద్రశేఖర్



సంగారెడ్డి మున్సిపాలిటీ: జిల్లా కేంద్రం సంగారెడ్డి మున్సిపల్ పరిధిలో ఉన్న వీధి కుక్కల బెడద నుంచి ప్రజలకు రక్షణ కల్పిస్తామని, అందుకు తగ్గట్లు ప్రత్యేక చర్యలు చేపడుతున్నామని సంగారెడ్డి మున్సిపల్ కమిషనర్ చంద్రశేఖర్ అన్నారు. శుక్రవారం సాక్షి ఆధ్వర్యంలో మధ్యాహ్నం 12 గంటల నుంచి ఒంటి గంట వరకు నిర్వహించిన ఫోన్ ఇన్ కార్యక్రమానికి విశేష స్పందన వచ్చింది. బల్దియా ప్రజలు కుక్కలు, పందులు, దోమలను అరికట్టాలని, అలాగే మున్సిపల్ పరిధిలో నెలకొని ఉన్న సమస్యలను పరిష్కరించాలని కమిషనర్‌ను కోరారు. 20 మంది ఫోన్ ద్వారా తమ సమస్యలను కమిషనర్ దృష్టికి తీసుకువచ్చారు.

మార్కెట్ ఉన్న ప్రతి గురువారం ట్రాఫిక్‌తో ఇబ్బందులు పడుతున్నాం.

– నర్సింలు, 33వ వార్డు, వసంతనగర్

కమిషనర్: మార్కెట్ ఉన్నప్పుడు ట్రాఫిక్‌తో ఇబ్బంది పడుతున్నామని కాల్స్ వస్తున్నాయి. రోడ్డుపై వరకు దుకాణ సామగ్రి రాకుండా, రోడ్డుపై ఉన్న వ్యాపారులను పక్కకు జరిపించి ఇబ్బంది కలగకుండా చూస్తాం. మరో రెండు నెలల్లో ఇంటిగ్రేటెడ్ మార్కెట్ సముదాయం అందుబాటులోకి వస్తుంది. ట్రాఫిక్ సమస్య పరిష్కారమవుతుంది.

బావిలో చెత్త వేస్తున్నారు. తీవ్ర దుర్గంధంతో పాటు ఈగలు, దోమలు విజృంభిస్తున్నాయి. అనారోగ్యం బారిన పడుతున్నాం. చర్యలు తీసుకోండి.

– శ్రీరామ్ కుమార్, ఒకటో వార్డు, బసవేశ్వర్ నగర్

మున్సిపల్ కమిషనర్: బావిలో ఎవరైనా చెత్త పారవేస్తున్నట్లు గుర్తిస్తే వెంటనే సమాచారం ఇవ్వండి. వారిపై చర్యలు తీసుకుంటాం. సిబ్బందిని పంపించి బావిలోని చెత్తను తీయించే ఏర్పాట్లు చేస్తాం.

వీధికుక్కలు గుంపులు గుంపులుగా తిరుగుతూ భయభ్రాంతులకు గురి చేస్తున్నాయి.

– సంతోష్, 32వ వార్డు

కమిషనర్: కుక్కలను పట్టుకోవడానికి ప్రత్యేక బందాన్ని ఏర్పాటు చేశాం. సిబ్బంది వచ్చినప్పుడు అవి దొరకడం లేదని తెలిసింది. వార్డులో సంచరిస్తున్నప్పుడు ఫొటోలు తీసి మాకు పంపండి. సిబ్బందిని వెంటనే పంపించి పట్టుకుంటాం.

వీధి కుక్కలు హడలెత్తిస్తున్నాయి. ఒంటరిగా వెళ్లే పిల్లల వెంట పడుతున్నాయి. కుక్కలను పట్టుకొని తీసుకెళ్లండి.

– శేఖర్, 12వ వార్డు, ద్వారకానగర్

కమిషనర్: ఇప్పటికే చాలావరకు కుక్కలను పట్టుకున్నాం. వాటికి టీకాలు వేసి వేరే ప్రదేశాలకు పంపిస్తున్నాం. అయితే ఒక చోటు నుంచి తరలిస్తే మరో చోటు నుంచి కుక్కలు వస్తున్నాయి. వీధి కుక్కల నుంచి ప్రజలకు రక్షణ కల్పిస్తాం.

జిల్లా ఆస్పత్రిలో చెత్తాచెదారం పేరుకుపోతుండటంతో రోగులు ఇబ్బందులు పడుతున్నారు. ఆ చెత్తా చెదారంతో ఆస్పత్రి చుట్టుపక్కల ఉన్న ఇళ్లలోకి తీవ్ర దుర్గంధం వ్యాపిస్తోంది. ఈగలు, దోమలు ఎక్కువై రోగాల బారిన పడుతున్నాం. తగు చర్యలు తీసుకోవాలి.

– శేఖర్, నేతాజీనగర్

కమిషనర్: ఆస్పత్రిలో పేరుకుపోతున్న చెత్తాచెదారాన్ని అక్కడ పనిచేసే కాంట్రాక్టర్ చూసుకుంటాడు. ఏదైనా వెహికల్ కావాలంటే మున్సిపాలిటీ నుంచి ఇస్తాం. అక్కడ పనిచేసే కాంట్రాక్టరే పూర్తి బాధ్యత తీసుకొని చెత్తను తొలగించి ఆస్పత్రి వాతావరణాన్ని శుభ్రంగా ఉంచాలి.

వీధిలైట్లు వెలగడం లేదు.

– లక్ష్మీప్రియ, బృందావన్ కాలనీ, 33వ వార్డు

కమిషనర్: వీధుల్లో లైట్లు వెలగకుంటే సమాచారం ఇవ్వండి. మరమ్మతులు చేస్తాం. అవసరమున్న చోట కొత్తవి ఏర్పాటు చేస్తాం.

– చైతన్య, బృందావన్ కాలనీ, 32వ వార్డు

మట్టి రోడ్డుతో ఇబ్బందులు పడుతున్నాం. సీసీ రోడ్డు వేయించాలి.

– సంతోష్‌కుమార్, అహ్మద్‌నగర్, 30వ వార్డు

కమిషనర్: పట్టణంలో అక్కడక్కడ సీసీ రోడ్ల పనులు జరుగుతున్నాయి. దశలవారీగా అవసరాన్ని బట్టి మరమ్మతులు, సీసీ రోడ్ల నిర్మాణ పనులు చేపడతాం. పట్టణంలో రూ.50 కోట్ల నిధులతో కాలనీ రోడ్లన్నీ సీసీ రోడ్లుగా తయారవుతాయి. అప్పటివరకు ఓపిక పట్టండి. అలాగే వార్డు కౌన్సిలర్‌తో ఒక లెటర్ రాసి ఇచ్చినట్లయితే కౌన్సిల్ బాడీలో తీర్మానం చేసి సీసీ రోడ్డుకు ప్రపోజల్ పంపించి పనులు చేపడతాం.

కమిషనర్: సంగారెడ్డిలో కొత్తగా బీటీ రోడ్లు, సీసీ రోడ్ల నిర్మాణాలు జరుగుతున్నాయి. బైపాస్ రోడ్డు నుంచి రాజంపేట వరకు వెళ్లే దారిని కూడా బీటీ రోడ్డుగా వేసేందుకు ప్రతిపాదనలు పంపిస్తాం. అప్పటివరకు ప్రజలు ఓపికపట్టాలి.

బైపాస్ అండర్ బ్రిడ్జి వద్ద సర్వీస్ రోడ్డులో స్పీడ్ బ్రేకర్లు వేయాలి.

– సుజన, వసంతనగర్

కమిషనర్: నేషనల్ హైవే అండర్ పాస్ సర్వీస్ రోడ్డు విషయంలో ఎలాంటి సమస్యలు ఉన్నా నేషనల్ హైవే అథారిటీకి తెలియజేయండి. మున్సిపల్ పరిధిలో హైవే రోడ్డుకు సంబంధించి ఎలాంటి పనులు జరగవు. పట్టణంలో ఏవైనా సమస్యలు ఉంటే పరిష్కరిస్తాం..

దోమలు విజృంభిస్తున్నాయి. ఫాగింగ్ చేయండి.

– రాహుల్, 33వ వార్డు, ఆదిత్య నగర్

కమిషనర్: వారానికోసారి దోమల మందు పిచికారీ చేయిస్తున్నాం. దోమల నియంత్రణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నాం. ప్రజలు కూడా రోడ్లపై ఇష్టారీతిన చెత్త పారవేయవద్దు.

క్లుప్తంగా

మందుబాబులకు జరిమానా

సిద్దిపేటకమాన్: మద్యం తాగి వాహనాలు నడుపుతూ పట్టుబడిన వాహనదారులకు సిద్దిపేట కోర్టు శుక్రవారం జరిమానా విధించింది. సిద్దిపేటలోని నర్సాపూర్ చౌరస్తా, ఎంపీడీఓ కార్యాలయ చౌరస్తా, రాజీవ్ రహదారిపై సిద్దిపేట ట్రాఫిక్ సీఐ రామకృష్ణ తమ సిబ్బందితో వాహన తనిఖీలు చేపట్టారు. తనిఖీల్లో 11 పట్టుబడ్డారు. వారిని సిద్దిపేట కోర్టులో హాజరుపర్చగా జడ్జి రమేశ్‌బాబు రూ.24,500 జరిమానా విధించారు.

ఆటో బైక్ ఢీ: ఇద్దరికి గాయాలు


గాయపడిన సత్యనారాయణ

కొడిపల్లి(నర్సాపూర్): ఆటో, బైక్ ఢీకొనడంతో ఇద్దరికి గాయాలయ్యాయి. ఈ సంఘటన కొడిపల్లి మండలం రాయిలాపూర్ గేట్ సమీపంలో 765 డి జాతీయ రహదారిపై శుక్రవారం జరిగింది. బాధితులు, స్థానికులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. బూర్గుపల్లి గ్రామానికి చెందిన సత్యనారాయణ తన బైక్‌పై హైదరాబాద్ వెళ్లి తిరిగి వస్తున్నాడు. ఇదే క్రమంలో కొడిపల్లి మండలం భుజిరంపేట పంచాయతీ వెంకటాపూర్ గ్రామానికి చెందిన ఆటో డ్రైవర్ ఆబేద్ నర్సాపూర్ వెళ్తున్నాడు. రాయిలాపూర్‌గేట్ సమీపంలో ఆటో, బైక్ ఢీకొన్నాయి. ఈ ఘటనలో సత్యనారాయణకు, ఆటోలో ఉన్న ఆబేద్‌కు గాయాలయ్యాయి. క్షతగాత్రులను చికిత్స కోసం 108లో నర్సాపూర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదుచేసుకుని పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

స్వగ్రామానికి వెళ్లిన వలస కూలీలు


ఖాళీగా ఉన్న గుడిసెలు

రామచంద్రాపురం(పటాన్‌చెరు): తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధి కొల్లూర్ రింగ్ రోడ్డు వద్ద లారీ దూసుకెళ్లిన ఘటనలో ముగ్గురు వలస కూలీలు మృతి చెందిన పాఠకులకు తెలిసిందే. తమ తోటివారు దుర్మరణం చెందడంతో మిగిలిన కార్మికులు తీవ్ర మనోవేదనతో తమ స్వగ్రామం కర్ణాటక రాష్ట్రంలోని యాదగిరి జిల్లా జింకేర తండాకు గురువారం సాయంత్రం వెళ్లినట్లు తెలిసింది.

భార్యాపిల్లలను కొట్టిన వ్యక్తికి రెండేళ్ల జైలు

మెదక్ మున్సిపాలిటీ: మద్యం మత్తులో భార్యాపిల్లలు, అత్తను గాయపరిచిన వ్యక్తికి కోర్టు జైలు శిక్ష విధించింది. శుక్రవారం జిల్లా ఎస్పీ రోహిణీ ప్రియదర్శిని తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. పెద్దశంకరంపేట మండలం కమలాపూర్ గ్రామానికి చెందిన నసిమి దత్తమ్మ 2019 డిసెంబర్ 16వ తేదీ రాత్రి తన ఇంట్లో వంట చేస్తోంది. ఆమె భర్త నసిమి విఠల్ మద్యం తాగొచ్చి ఆమెను, కూతురు మమతను చంపుతానంటూ బండరాయితో తలపై కొట్టాడు. అడ్డం వచ్చిన ఆమె తల్లి పెంటమ్మను కొట్టడంతో తీవ్రంగా గాయపడింది. అందరినీ చంపుతానంటూ బెదిరించాడు. దీంతో బాధితులు ఫిర్యాదు చేయగా అప్పటి పోలీసులు కేసు నమోదు చేశారు. శుక్రవారం మెదక్ జిల్లా కోర్టులో కేసు విచారణకు రాగా జడ్జి జితేందర్ విచారణ చేశారు. నేరం రుజువు కావడంతో నసిమి విఠల్‌కు రెండేళ్ల కఠిన జైలు శిక్ష విధిస్తూ తీర్పునిచ్చినట్లు ఎస్పీ తెలిపారు. నిందితుడికి శిక్ష పడేలా కృషి చేసిన కోర్టు కానిస్టేబుళ్లను, సిబ్బందిని ఎస్పీ అభినందించారు.

ఫైర్ సేఫ్టీపై పట్టింపేది?

- వేసవిలో పరిశ్రమల్లో తరచూ ప్రమాదాలు
- నివారణకు చర్యలు తీసుకోవాలని కోరుతున్న కార్మికులు
- విఫలవుతున్న యాజమాన్యం, అధికారులు
- భయాందోళన మధ్య పనిచేస్తున్న కార్మికులు


గడ్డపోతారం పారిశ్రామికవాడలోని పరిశ్రమలో జరిగిన ప్రమాదంలో ఎగిసి పడుతున్న మంటలు (ఫైల్)

జిన్నారం(పటాన్‌చెరు): వేసవిలో పరిశ్రమల్లో అగ్ని ప్రమాదాలు సంభవిస్తుంటాయి. వీటిని నివారించటంలో పరిశ్రమల యాజమాన్యాలు, అధికారులు విఫమవుతున్నారు. యాజమాన్యాల నిర్లక్ష్య వైఖరితో పరిశ్రమల్లో పనిచేస్తున్న కార్మికులు మృత్యువాత పడుడుతున్నారు. కొన్ని సంఘటలనల్లో తీవ్ర గాయాలపాలవుతున్నారు. రసాయన పరిశ్రమల్లో వరుసగా జరుగుతున్న అగ్ని ప్రమాదాలపై ప్రత్యేక కథనం.

జిల్లా వ్యాప్తంగా సుమారు 8 వేల పరిశ్రమలు ఉన్నాయి. వీటిలో 5 వేల వరకు రసాయన పరిశ్రమలు ఉన్నాయి. జిల్లాలోని పటాన్‌చెరు, పాశమైలారం, బొల్లారం, గడ్డపోతారం, ఖాజీపల్లి, బొంతపల్లి, హత్నూర, సంగారెడ్డి, జహీరాబాద్ ప్రాంతాల్లో పరిశ్రమలు ఉన్నాయి. ఈ పరిశ్రమల్లో వేల సంఖ్యలో కార్మికులు పనిచేస్తున్నారు. దేశంలోని దాదాపు అన్ని రాష్ట్రాలకు చెందిన వారు ఈ పరిశ్రమల్లో ఉన్నారు. వేసవి ప్రారంభమైన నాటి నుంచి కార్మికులు భయపడుతూ పరిశ్రమల్లో పనిచేస్తుంటారు. సీజన్ ప్రారంభమైనప్పటి నుంచి వరుసగా అగ్ని ప్రమాదాలు జరుగుతూనే ఉన్నాయి. ప్రమాదాలను ముందుగా పసిగట్టడంతో పరిశ్రమల యాజమాన్యాలు విఫలమవుతున్నాయి. వరుస అగ్ని ప్రమాదాల్లో ఏడాదిలో సుమారు 150 మంది గాయపడగా, 60 మంది మృత్యువాతపడ్డారని అధికారులే చెబుతున్నారు. అగ్ని ప్రమాదాల్లో సుమారు రూ.వంద కోట్ల వరకు ఆస్తి నష్టం జరిగి ఉండొచ్చని వారి అంచనా

అగ్ని ప్రమాదాలకు కారణమేంటి?

రసాయన పరిశ్రమల్లో ఎక్కువగా మండే గుణం ఉన్న రసాయాలను వినియోగిస్తుంటారు. రియాక్టర్‌లో వాటిని వేసే టప్పుడు అప్రమత్తంగా, జాగ్రత్తలు తీసుకోకపోవడతో రియాక్టర్ పేలి ప్రమాదాలు జరుగుతున్నాయి. రసాయనాలను వేరు చేసే క్రమంలోనే ఇవి సంభవిస్తున్నాయి. ఇలాంటి ఘటనలు జరుగకుండా ఉండేందుకు యాజమాన్యం నైపుణ్యం ఉన్న ఉద్యోగులతో పనులు చేయించాల్సి ఉంటుంది. ఈ విషయంలో యాజమాన్యాలు నిర్లక్ష్యం వహిస్తుండటంతో ఇలాంటి ప్రమాదాలు జరుగుతూనే ఉంటాయని సంబంధిత శాఖ అభిప్రాయం. పరిశ్రమల శాఖ అధికారులు కూడా ప్రమాదాల నివారణ కోసం దృష్టి సారించటం లేదనే ఆరోపణలు ఉన్నాయి.

భయాందోళనలో కార్మికులు

వేసవి వస్తుందంటే చాలు కార్మికుల్లో దడ మొదలవుతుంది. ఎండలు ఎక్కువగా ఉండటంతో తరచూ ప్రమాదాలు జరుగుతుండటం వల్ల కార్మికులు భయాందోళన మధ్య విధులు నిర్వహిస్తున్నారు. పనిచేసే ప్రాంతంలో ప్రమాదాలు సంభవిస్తుండటంతో ఎక్కువ సంఖ్యలో మృత్యువాతపడుతున్నారు. ప్రమాదాలు జరగకుండా యాజమాన్యం, అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని కార్మికులు కోరుతున్నారు.

ఇటీవల జరిగిన ప్రమాదాల వివరాలు

- గడ్డపోతారం పారిశ్రామికవాడలోని మైలాన్ పరిశ్రమలో ఇటీవల జరిగిన అగ్ని ప్రమాదంలో ముగ్గురు కార్మికులు మృతి చెందారు. మరో ఇద్దరు కార్మికులు గాయపడ్డారు.
- లీఫార్మా పరిశ్రమలో జరిగిన ప్రమాదంలో ఇద్దరు కార్మికులు తీవ్రంగా గాయపడ్డారు.
- ఖాజీపల్లి పారిశ్రామికవాడలోని కేకులే పరిశ్రమలో అగ్ని ప్రమాదం సంభవించింది.
- ఇటీవల బొల్లారంలోని శ్రీకర ల్యాబ్స్ పరిశ్రమలో అగ్ని ప్రమాదం జరిగింది. ఐదుగురు తీవ్రంగా గాయపడ్డారు.
- బొల్లారంలోని ఓ పరిశ్రమలో జరిగిన ప్రమాదంలో ఓ కార్మికుడు సజీవ దహనమయ్యాడు.
- బొల్లారం పారిశ్రామిక వాడలో వింధ్య ఆర్గానిక్స్ పరిశ్రమలో భారీ అగ్ని ప్రమాదం జరిగింది. ముగ్గురు కార్మికులు గాయపడ్డారు.
- పరిశ్రమల్లో జరిగిన ప్రమాదాల వివరాలు బయటకు రాకుండా యాజమన్యాలు చర్యలు తీసుకుంటుండటం గమనార్హం.

ఆదేశాలు ఇస్తునే ఉన్నాం

వేసవిలో తరచూ అగ్ని ప్రమాదాలు జరుగుతూనే ఉన్నాయి. ఈ సీజన్‌లో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై యాజమాన్యాలకు తగిన సూచనలు, సలహాలు ఇస్తున్నాం. నిబంధనలు పాటించని యాజమాన్యాలపై కఠిన చర్యలుతీసుకుంటున్నాం.

– ప్రవీణ్‌కుమార్, ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ డిప్యూటీ చీఫ్

పటాన్‌చెరులో ఇండస్ట్రియల్ క్రికెట్ టోర్నమెంట్

వివరాలు వెల్లడించిన ఎండీఆర్ ఫౌండేషన్ సలహాదారుడు పృథ్వీరాజ్


మాట్లాడుతున్న ఎండీఆర్ ఫౌండేషన్ సలహాదారుడు పృథ్వీరాజ్

పటాన్‌చెరు టౌన్: పటాన్‌చెరు పట్టణంలోని మైత్రి మైదానంలో ఇండస్ట్రియల్ క్రికెట్ టోర్నమెంట్ 2023ను శనివారం ప్రారంభించనున్నట్లు ఎండీఆర్ ఫౌండేషన్ గౌరవ సలహాదారుడు పృథ్వీరాజ్ తెలిపారు. శుక్రవారం పట్టణంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఎండీఆర్ ఫౌండేషన్ అధ్యక్షుడు మధుతో కలిసి వివరాలు వెల్లడించారు. టోర్నమెంట్‌లో 25 పరిశ్రమలు పాల్గొనున్నట్లు తెలిపారు. మార్చి 4, 5, 11,12 తేదీల్లో వీకెండ్ క్రికెట్ టోర్నమెంట్ నిర్వహించనున్నామన్నారు. ఇందులో గెలుపొందిన వారికి మొదటి బహుమతి కింద రూ.33,333 నగదు బహుమతి అందజేస్తామన్నారు. ఇప్పటివరకు ఇండస్ట్రియల్ క్రికెట్ టోర్నమెంట్ నిర్వహించలేదని చెప్పారు. టోర్నమెంట్ ప్రారంభోత్సవ కార్యక్రమానికి స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ తెలంగాణ చైర్మన్ ఆంజనేయ గౌడ్ ప్రారంభిస్తారని తెలిపారు. ఎండీఆర్ ఫౌండేషన్ చైర్మన్ దేవేందర్ రాజు సహకారంతో పోటీలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు.

సైబర్ నేరాల నియంత్రణకు ప్రత్యేక చర్యలు

సీపీ శ్వేత

సిద్దిపేటకమాన్: సిద్దిపేట పోలీసు కమిషనరేట్ పరిధిలో సైబర్ నేరాల నియంత్రణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు సీపీ శ్వేత తెలిపారు. శుక్రవారం ఆమె మాట్లాడుతూ కమిషనరేట్ పరిధిలో ప్రతీరోజు ఏ రకమైన సైబర్ నేరాలు జరుగుతున్నాయో పత్రికల ద్వారా తెలియజేస్తామన్నారు. సైబర్ నేరగాళ్లు తక్కువ సమయంలో ఎక్కువ సంపాదించవచ్చని ఆశ చూపి మోసాలకు పాల్పడుతున్నారన్నారు. వ్యక్తిగత సమాచారం సామాజిక మాధ్యమాల్లో పంచుకోకూడదని, ఫోన్లు వినియోగించేటపుడు జాగ్రత్తగా ఉండాలన్నారు. సైబర్ క్రైమ్ జరిగిన వెంటనే 1930కు ఫిర్యాదు చేయాలని సూచించారు. శుక్రవారం సిద్దిపేట పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగిన సైబర్ నేరాల వివరాలు తెలిపారు.

- సిద్దిపేట టూ టౌన్ పరిధిలోని ఓ వ్యక్తికి అపరిచితుడు ఫోన్ చేసి మీ బ్యాంకు ఖాతా బ్లాక్ అయింది, మీ పాన్ కార్డు అప్‌డేట్ చేయాలని ఓ లింకు పంపాడు. ఆ లింకును క్లిక్ చేయడంతో బాధితుడి ఖాతా నుంచి రూ.1,28,650 డెబిట్ అయ్యాయి.
- అలాగు పాన్‌కార్డు అప్‌డేట్ చేయాలని చెప్పి పట్టణానికి చెందిన మరో వ్యక్తి ఖాతా నుంచి రూ.12,010 సైబర్ నేరస్తుడు కాజేశాడు.
- దుబ్బాక పోలీస్ స్టేషన్ పరిధిలోని ఓ వ్యక్తి ఆన్‌లైన్‌లో క్యాష్ పిన్ యాప్ ద్వారా రూ.12,317 లోన్ తీసుకున్నాడు. ఆ డబ్బులు చెల్లించినా, బాధితుడికి లోన్ యాప్ నిర్వాహకులు మళ్లీ మళ్లీ ఫోన్ చేస్తున్నారు. ఇంకా డబ్బులు చెల్లించాలని లేనట్లయితే కుటుంబ సభ్యుల ఫొటోలు మార్ఫింగ్ చేసి ఇంటర్‌నెట్‌లో పెడతామని బెదిరించడంతో బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు.
- దౌల్తాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఓ వ్యక్తికి మీకు గిఫ్ట్ వచ్చింది, దానికి ప్రాసెసింగ్ చార్జీల చెల్లించాలని అపరిచితుడు ఫోన్ చేశాడు. అది నమ్మి బాధితుడు రూ.49,500 పంపించాడు. అనంతరం ఆ నంబర్‌కు ఫోన్ చేయగా స్పందించలేదు. దీంతో తాను మోసపోయినట్లు గ్రహించి పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

కేసు పెట్టిందని ఒకరు.. పుట్టింటికి వెళ్లిందని మరొకరు

పటాన్‌చెరుటౌన్: భార్య కేసు పెట్టిందని జీవితంపై విరక్తి చెందిన భర్త ఆత్మహత్యకు యత్నించాడు. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందాడు. ఈ సంఘటన భానూర్–బీడీఎల్ పోలీసు స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఎస్‌ఐ సాయిలు కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. రామచంద్రాపురం పరిధిలోని వెలిమెలకు చెందిన చాకలి రాజు(36) వెలిమెల సమీపంలోని ఓ ప్రైవేట్ కంపెనీలో పనిచేస్తున్నాడు. 2014లో లింగంపల్లికి చెందిన మమతతో వివాహం జరిగింది. వీరికి ఇద్దరు పిల్లలున్నారు. ఇటీవల భార్యభర్తలు గొడవపడ్డారు. దీంతో మమత పుట్టింటికి వెళ్లింది. చందానగర్ పోలీసుస్టేషన్ లో భర్తపై వరకట్న వేధింపుల కేసు పెట్టింది. పిల్లలు, భార్య దూరమయ్యారని, అంతేకాకుండా తనపై కేసు పెట్టిందని జీవితంపై విరక్తితో రాజు ఈనెల 1వ తేదీన ఇంటి నుంచి బయటకు వెళ్లాడు. తిరిగి ఇంటి వచ్చిన రాజు నోటి నుంచి నురుగు వస్తుండటంతో మృతుడి మేనత్త చూసి కుటుంబ సభ్యులు సమాచారం ఇచ్చింది. చికిత్స కోసం పటాన్‌చెరు ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకరాగా చికిత్స పొందుతూ గురువారం రాత్రి 11 గంటలకు మృతిచెందాడు. సమాచారం తెలుసుకున్న పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం పటాన్‌చెరు ప్రభుత్వ ఆసుపత్రి తరలించారు. మృతుడి తండ్రి చాకలి లక్ష్మయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.


రాజు (ఫైల్)

హద్నూర గ్రామానికి చెందిన..

మునిపల్లి(అందోల్): భార్య పుట్టింటికి వెళ్లి తిరిగి రాకపోవడంతో మనస్తాపంతో భర్త ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ సంఘటన మండలంలోని కంకోల్ శివారులో శుక్రవారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. న్యాల్‌కల్ మండలం హద్నూర గ్రామానికి చెందిన కోరంపల్లి శ్రీశైలం (35) మునిపల్లి మండలం లింగంపల్లిలో ఉంటున్నాడు. ఆటో నడుపుతూ జీవనం సాగిస్తున్నాడు. ఇతడికి భార్య సుజాత, ముగ్గురు ఆడపిల్లలు, కుమారుడు ఉన్నారు. గతంలో శ్రీశైలం జైలు శిక్ష అనుభవించి వచ్చాడు. అప్పటి నుంచి భార్యభర్తలు గొడవపడుతున్నారు. గొడవల నేపథ్యంలో సుజాత న్యాల్‌కల్‌లోని పుట్టింటికి వెళ్లి తిరిగిరాలేదు. దీంతో మనస్తాపం చెంది శుక్రవారం కంకోల్ శివారులో శ్రీశైలం చెట్టుకు ఉరివేసున్నాడు. మృతుడి భార్య సుజాత ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు.

మతిస్థిమితంలేని తల్లి కొడుతోందని..

- భరించలేక ఇంటి నుంచి పారిపోతున్న బాలికలు
- చేరదీసి అధికారులకు అప్పగించిన గ్రామస్తులు


చిన్నారులతో మాట్లాడుతున్న ఐసీడీఎస్ అధికారులు

అల్లాదుర్గం(మెదక్): మతిస్థిమితం లేని తల్లి తరచూ కొడుతుండటంతో భరించలేని ఇద్దరు బాలికలు ఇంటి నుంచి పారిపోతున్నారు. రహదారిపై వారిని చూసిన ఉపాధి హామీ కూలీలు గమనించి చేరదీశారు. విషయం తెలుసుకుని ఇంటికి పంపించే ప్రయత్నం చేయగా వెళ్లమని చెప్పడంతో ఐసీడీఎస్ అధికారులకు అప్పగించారు. ఈ సంఘటన శుక్రవారం అల్లాదుర్గం మండలం కాయిదంపల్లి గ్రామంలో చోటు చేసుకుంది. గ్రామస్తులు తెలిపిన వివరాలు ఈ విధంగా ఉన్నాయి. కాయిదంపల్లి గ్రామానికి చెందిన కర్రెళ్ల మొగులయ్య, పాపమ్మ దంపతులకు ఇద్దరు ఆడపిల్లలు ప్రియాంక(10), మధుప్రియ(7) ఉన్నారు. గతంలో తండ్రి మొగులయ్య మృతి చెందాడు. పిల్లలను తల్లి పోషిస్తోంది. కాగా కొంత కాలంగా పాపమ్మ మనసిక జబ్బుతో బాధపడుతోంది. తరచూ పిల్లలను కొడుతోంది. శుక్రవారం కూడా కొట్టడంతో ఇంటి నుంచి వెళ్తూ గ్రామానికి చెందిన ఉపాధి హామీ కూలీలకు కనిపించారు. అక్కాచెల్లెళ్లను చూసి ఎక్కడికి వెళ్తున్నారని ప్రశ్నించగా అమ్మ కొడుతోందని అందుకే ఇంటి నుంచి వెళ్లిపోతున్నామని బదులిచ్చారు. వారిని తమ ఇంటికి తీసుకెళ్లి భోజనం పెట్టి ఇక్కడే ఉండాలని సముదాయించారు. ఇంటికి వెళ్లాలని చెప్పడంతో తాము వెళ్లమని చెప్పారు. దీంతో స్థానికులు అల్లాదుర్గం ఐసీడీఎస్ అధికారులకు సమాచారం ఇచ్చారు. విషయం తెలుసుకున్న అల్లాదుర్గం ఇన్‌చార్జి సీడీపీఓ వెంకటరమణ, సూపర్‌వైజర్ నాగమణి చిన్నారులను చేరదీసి సముదాయించారు. అమ్మ వద్దకు వెళ్లమని చెప్పిన వారు వెళ్లమని చెప్పడంతో ప్రియాంక, మధుప్రియను జిల్లా కేంద్రంలోని బాలసదన్‌కు తరలిస్తామని, బాధ్యత ప్రభుత్వం తీసుకుంటుందని వారు తెలిపారు.

భర్తను చంపిన హత్యకేసులో..

భార్యకు జీవిత ఖైదు


తొంట సుశీల

వట్‌పల్లి(అందోల్): భర్తను చంపిన హత్య కేసులో భార్యకు జీవిత ఖైదు, జరిమానా విధిస్తూ జిల్లా కోర్టు జడ్జి శ్రీధర్‌రెడ్డి తీర్పు చెప్పారు. శుక్రవారం ఎస్‌ఐ అంబర్యా తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మండల పరిధిలోని పోతులబోగుడా గ్రామానికి చెందిన తొంట నర్సింహులు అలియాస్ దాసు(56) 2015లో హత్యకు గురయ్యాడు. మృతుడి తండ్రి దుర్గయ్య వట్‌పల్లి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశారు. నిందితులను విచారించగా మృతుడి భార్య తొంట సుశీల మునిపల్లి మండలానికి చెందిన ఆటో డ్రైవర్ చింతలగట్టు కుమార్‌తో అక్రమ సంబంధం పెట్టుకొంది. తన భర్తను చంపి పాతిపెట్టినట్లు నేరం రుజువు కావడంతో ఆమెకు జీవిత ఖైదుతో పాటు జరిమానా విధించినట్లు ఎస్‌ఐ తెలిపారు.

కుక్కల దాడిలో గొర్రె పిల్లలు మృతి

- మరో 12లో మేకలు, గొర్రెలకు గాయాలు
- రూ.1.50 లక్షల నష్టం


కొడిపల్లిలో ఊర కుక్కల దాడిలో మృతి చెందిన జీవాలు

కొడిపల్లి(నర్సాపూర్): ఊర కుక్కల దాడిలో కొన్ని జీవాలు మృత్యువాతపడగా, మరికొన్ని గాయపడ్డాయి. వివరాలు ఇలా ఉన్నాయి. మండల కేంద్రమైన కొడిపల్లి గ్రామానికి చెందిన ఇట్టబోయిన పోచయ్య గొర్రెలు, మేకల పెంపకంతో కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. రోజుమాదిరిగానే గురువారం రాత్రి కొట్టంలో వాటిని వదిలిపెట్టాడు. రాత్రి ఊర కుక్కలు గొర్రెల కొట్టంలో ప్రవేశించి దాడి చేయడంతో 12 గొర్రె పిల్లలు మృతి చెందగా మరో 12లో మేకలు, గొర్రెలు తీవ్రంగా గాయపడ్డాయి. సుమారు రూ.1.50 లక్షలు నష్టం వచ్చిందని బాధితుడు తెలిపాడు. ఈ విషయం పశువైద్యాధికారికి తెలపడంతో ఆయన వచ్చి గాయపడినవారికి చికిత్స చేశాడు. జీవాల మృతి చెందడటంతో తీవ్రంగా నష్టపోయానని ప్రభుత్వం స్పందించి ఆదుకోవాలని బాధితుడు విజ్ఞప్తి చేశాడు. కాగా వెటర్నరీ అసిస్టెంట్ చెన్నయ్య మాట్లాడుతూ చనిపోయన వాటికి బీమా లేదన్నారు. ఈ విషయం జిల్లా అధికారులకు తెలియచేస్తామనన్నారు. గ్రామంలో ఊర కుక్కలు, కోతుల బెడద ఎక్కువగా ఉందన్నారు.

భార్యపై దాడిచేసిన భర్త

గాయపడిన భార్య, కేసునమోదు


కొత్తపేటలో విచారణ చేస్తున్న పోలీసులు

శివ్వంపేట(నర్సాపూర్): భార్యపై దాడిచేసి గాయపరిచిన భర్తపై కేసునమోదు చేసినట్లు ఎస్‌ఐ రవికాంతరావు తెలిపారు. శుక్రవారం పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని అల్లీపూర్ గ్రామానికి చెందిన గుమ్మల పోచయ్య కూతురు మీనాను కొత్తాపేట గ్రామానికి చెందిన అశోక్‌కిచ్చి మూడేళ్ల క్రితం వివాహం చేశారు. కట్నకానుకల కింద కిలో వెండి, ఎనిమిది తులాల బంగారు ఆభరణాలు, బైక్, రూ.50 వేలు ఇచ్చారు. కొన్ని నెలల తర్వాత అదనపు కట్నం తేవాలని మీనాను భర్త అశోక్, అత్త భారతమ్మ, మామ నర్సయ్య వేధిస్తున్నారు. ఈక్రమంలో జనవరి 22వ తేదీన అత్తింటివారు మీనాతో మళ్లీ వేధించి పుట్టింటికి వెళ్లగొట్టారు. ఈ విషయంలో ఇద్దరికీ రాజీ కుదిర్చేందుకుగాను పెద్దమనుషుల సమక్షంలో మాట్లాడుకుందామని కొత్తపేట వెళ్లారు. పెద్దమనుషులు మాట్లాతుండగా మీనాను భర్త అశోక్ రాయితో కొట్టడంతో ఆమెకు తీవ్ర గాయాలయ్యాయి. బాధితురాలి తండ్రి ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

విద్యార్థుల ఫిర్యాదుపై విచారణ


శాదుల్లా బాబాను ప్రశ్నిస్తున్న ఎంఈఓ శ్రీనివాస్‌రెడ్డి

కొండపాక(గజ్వేల్): కుకునూరుపల్లి హైస్కూల్ సాంఘిక శాస్త్రం ఉపాధ్యాయుడిపై విద్యార్థులు, తల్లిదండ్రులు చేసిన ఫిర్యాదుపై అధికారులు చర్యలు చేపట్టారు. డీఈఓ ఆదేశాల మేరకు శుక్రవారం ఎంఈఓ శ్రీనివాస్‌రెడ్డి విచారణ చేశారు. పాఠ్యాంశాల సందేహాలను అడిగిన విద్యార్థినులపై అనుచిత వాఖ్యలు, పరీక్షల్లో ఫెయిల్ చేస్తామంటూ 7వ తరగతి క్లాస్ టీచర్ శాదుల్లాబాబా బెదిరించడంతో అతడిపై ఫిర్యాదు చేసిన విషయం పాఠకులకు విధితమే. విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల సమక్షంలో ఎస్‌ఎంసీ చైర్మన్ మల్లం ఐలయ్య శాదుల్లా బాబాను ప్రశ్నించగా మరో మారు తప్పు జరగకుండా చూసుకుంటామని ఎంఈఓకు లిఖిత పూర్వకంగా రాసి ఇచ్చారు. అనంతరం ఎంఈఓ మాట్లాడుతూ విద్యార్థుల సందేహాలను నివృత్తి చేయడంలో నిర్లక్ష్యం చేస్తే క్షమించేది లేదంటూ హెచ్చరించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం బాలకిషన్, ఉపాధ్యాయులు సత్యనారాయణరెడ్డి, ఫ్రాన్సిస్, అజయ్‌కుమార్‌రెడ్డి, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఆస్తికోసం అంతమొందించాడు

- బావమరిదిని హత్యచేసిన బావ
- మరో నలుగురితో కలిసి ఘాతుకం
- మృతదేహాన్ని సాగర్‌లో పడేసిన నిందితులు
- ఒకరు పరారీ, నలుగురి అరెస్ట్


వివరాలు వెల్లడిస్తున్న సీపీ శ్వేత, పక్కన అడిషనల్ డీసీపీ అడ్మిన్ మహేందర్

సిద్దిపేటకమాన్: హత్యకుగురై కొండపోచమ్మ సాగర్‌లో శవమై తేలిన కేసు మిస్టరీని పోలీసులు ఛేదించారు. నిందితులను అరెస్ట్ చేసి జైలుకు తరలించినట్లు సిద్దిపేట పోలీసు కమిషనర్ ఎన్.శ్వేత తెలిపారు. శుక్రవారం పోలీసు కమిషనర్ కార్యాలయంలో అడిషనల్ డీసీపీ అడ్మిన్ మహేందర్‌తో కలిసి సీపీ శ్వేత శుక్రవారం విలేకరులకు వెల్లడించారు. ఫిబ్రవరి 27వ తేదీన ములుగు ఎస్‌ఐ రంగకృష్ణ తమ సిబ్బందితో కలిసి కొండపోచమ్మ సాగర్ పరిసర ప్రాంతాల్లో పెట్రోలింగ్ నిర్వహిస్తుండగా గుర్తు తెలియని వ్యక్తి మృతదేహాన్ని కొండపోచమ్మ సాగర్‌లో గుర్తించారు. ఆధారాలు లభించకపోవడంతో మృతుడి ఫొటోలు సోషల్ మీడియాలో పోస్ట్ చేశారు. మృతుడు సంగారెడ్డి జిల్లా, కంది మండలం ఇంద్రకరణ్ గ్రామానికి చెందిన చాకలి మధు (27)గా కుటుంబ సభ్యులు గుర్తించారు. మృతుడి చెల్లెలు చాకలి మౌనిక తన అన్న మధును గుర్తు తెలియని వ్యక్తులు హత్య చేసి కొండపోచమ్మ సాగర్‌లో పడేశారని పోలీసులకు ఫిర్యాదు చేసింది. దీంతో ములుగు పోలీసులు కేసు నమోదు చేసి, గజ్వేల్ ఏసీపీ రమేశ్ ఆధ్వర్యంలో రెండు బృందాలుగా ఏర్పడి దర్యాప్తు చేపట్టారు. సాంకేతిక సాయంతో పోలీసులు నిందితులను పట్టుకున్నారు. నేరం చేసినట్లు ఒప్పుకున్నారు. మృతుడు మధు చెల్లెలు మౌనికను మూడేళ్ల క్రితం సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరు మండలం రుద్రారం గ్రామానికి చెందిన చాకలి రాములు (32)తో వివాహం జరిపించారు. వివాహ సమయంలో మధుకు ఉన్న ఎకరం భూమిలో నుంచి మూడు గుంటలు మౌనిక పేరుపై రిజిస్టర్ చేయించి ఇచ్చారు. మధు జల్సాలకు అలవాడుపడ్డాడు. ఎకరం భూమిలో నుంచి కొద్ది కొద్దిగా అమ్ముతూ వచ్చిన డబ్బు ఖర్చు చేశాడు. మౌనికకు ఇచ్చిన మూడు గంటల భూమితోపాటు తనకున్న మరో ఐదు గంటల భూమిని విక్రయించాడు. గుంటకు రూ.8 లక్షల చొప్పున అమ్మగా వచ్చిన డబ్బుల్లో చెల్లెలుకు రూ.11 లక్షలు మాత్రమే ఇచ్చాడు. దీంతో కోపం పెంచుకున్న బావ రాములు బావమరిదిని చంపితే అతని పేరిట ఆస్తి మొత్తం తనకే దక్కుతుందనే ఆలోచనతో మధును హత్య చేయాలని పథకం వేసుకున్నారు. శ్రీకాకుళం జిల్లా పైరువాడ మండలానికి చెందిన డీసీఎం డ్రైవర్ బూర్ల ఈశ్వర్‌రావు, స్నేహితుడు సంగారెడ్డి జిల్లా, పటానుచెరు మండలం, రుద్రారం గ్రామానికి చెందిన వడ్డే మహేశ్‌లకు డబ్బులు ఇస్తానని హత్యకు సహాయం చేయాలని కోరాడు. దీనికి అంగీకరించిన ఈశ్వర్ తనకు తెలిసిన ములుగు మండలం మామిడ్యాలకు చెందిన పసుల మల్లేశ్, ములుగు మండలం బైలంపూర్‌కు చెందిన జూపల్లి శేఖర్‌లతో కలిసి ఫిబ్రవరి 24వ తేదీన ముందుగా వేసుకున్న పథకం ప్రకారం తక్కువ ధరకు భూమి అమ్మకం ఉందని మధును నమ్మించారు. కొండపోచమ్మ ప్రాజెక్టు వద్ద మధుతో కలిసి నిందితులందరూ మద్యం తాగారు. రాత్రి మధును హత్యచేసి, శవాన్ని తాళ్లతో రాళ్లు కట్టి కొండపోచమ్మ సాగర్‌లో పడేశారు. నలుగురు నిందితులను అరెస్ట్ చేసి వారి నుంచి రూ.లక్ష నగదు, నాలుగు సెల్‌ఫోన్‌లు, బ్రిజా కారు, బైక్, ఖాళీ మద్యం సీసాలు స్వాధీనం చేసుకుని జ్యుడీషియల్ రిమాండ్‌కు తరలించినట్లు సీపీ తెలిపారు. పరారీలో ఉన్న మరో నిందితుడు బూర్ల ఈశ్వర్‌రావును త్వరలోనే పట్టుకుంటామన్నారు. కేసును ఛేదించిన గజ్వేల్ ఏసీపీ రమేశ్, రూరల్ సీఐ రాజశేఖర్‌రెడ్డి, ఎస్‌ఐ రంగకృష్ణ, పోలీసు సిబ్బందిని సీపీ అభినందించారు. వీరికి త్వరలో రివార్డులు అందజేస్తామన్నారు.